క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన స్పాట్ కౌన్సెలింగ్



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి), సుద్దపల్లి గ్రామాల్లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ధర్మారం(బి) గురుకుల కళాశాలలో ఎంపీసీలో 12, బైపీసీలో 11 సీట్లు, సుద్దపల్లి కళాశాలలో ఎంపీసీలో 18, బైపీసీలో 16 సీట్లు భర్తీ చేసినట్లు ప్రిన్సిపాళ్లు మాధవీలత, నళిని తెలిపారు. కౌన్సెలింగ్‌లో వైస్ ప్రిన్సిపాళ్లు స్వప్న, ఎం. ప్రేమలత, సిబ్బంది నూర్జిన బేగం, సుమలత, జ్యోతి, దమయంతి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త చిట్టాపూర్ ఏనుగు దయానంద్‌రెడ్డి మూడు కంప్యూటర్లు, జైడి రాజ్‌కుమార్ సీనియర్ పీడీ ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పీడీ గంగామోహన్, ఉపాధ్యాయులు సునీత, మాలతి, కృష్ణ, పల్లె గంగాధర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ గౌతమి పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



నిజామాబాద్ రూరల్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శనివారం నిర్వహించే బీజేపీ ఓబీసీ మోర్చా మహాధర్నాను విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మదాసు స్వామి యాదవ్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ధర్నాను బీసీ కుల, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాస్టర్ శంకర్, నారాయణ యాదవ్, గిరిబాబు, సురేశ్, రాజకుమార్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలతో చిరకాల వాంఛ నెరవేరింది



నిజామాబాద్ సిటీ: జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకావడంతో జిల్లావాసుల చిరకాల వాంఛ నెరవేరిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ గురువారం పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల కోసం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విశేషంగా కృషి చేశారని అన్నా రు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులు ఇంజినీర్లు కావాలనే కల నెరవేరనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఎంకు సన్మానం

జక్రాన్‌పల్లి: మండల ఏపీఎంగా పని చేసి డిచ్‌పల్లికి బదిలీపై వెళ్లిన రవీందర్‌రెడ్డిని మండల మహిళా సమాఖ్య సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఏపీవో రవి,సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	100,100	వెండి(కిలో)	1,18,500
22 క్యారెట్స్	92,400	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	80	గాజరుగడ్డ	40	80
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	40	80	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	60	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	35	60	గోబిపువ్వు	20	40
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	30	60	కరివేపాకు	40	80
మెంతికూర	30	60	చామగడ్డ	30	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	80
పుదీనా	50	90	గోరుచిక్కుడు	35	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

రోడ్డు ఆక్రమణల తొలగింపు

- సాక్షి కథనానికి స్పందించిన ట్రాఫిక్, బల్దియా అధికారులు
- హైదరాబాద్ రోడ్డులో తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు



ప్రగతినగర్‌లో సైన్‌బోర్డులు తొలగిస్తున్న సిబ్బంది





రోడ్డుపై అడ్డుగా ఉన్న బోర్డులు, తాత్కాలిక నిర్మాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తా నుంచి పులాంగ్ వరకు రోడ్డును ఆనుకొని నిర్మించిన సైన్‌బోర్డులు, ఇతర తాత్కాలిక నిర్మాణాలను మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. నగరవాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'శాశ్వత పరిష్కారం చూపేదెప్పుడు..?' అనే కథనానికి బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. హైదరాబాద్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలు, వేణుమాల్ వద్ద అడ్డుగా ఉన్న బోర్డులను తొలగించారు. ఎల్లమ్మగుట్ట చౌరస్తా నుంచి పులాంగ్ వరకు రోడ్డును ఆనుకుని నిర్మించిన సైన్‌బోర్డులు, ఇతర తాత్కాలిక నిర్మాణాలను తొలగించినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో ప్రతిరోజు ఆక్రమణల తొలగింపు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం



భూమిపూజ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ రూరల్: ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నగరంలోని 39వ డివిజన్, ఓల్డ్ ఎన్జీవోఎస్ కాలనీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. నిర్మాణానికి తన వంతు సహాయ సహకారం ఉంటుందని అన్నారు. ప్రజల ఉపయోగం కోసం నిర్మిస్తున్న ఈ భవన పనులను త్వరగా ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు.
కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ కృష్ణ, కొండ ఆశన్న, ఇల్లెందుల ప్రభాకర్, పార్శి రాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



ఖలీల్‌వాడి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పదవీ విరమణ పొందిన ఏఎస్సై మురళీధర్ రాజు(వేల్పూర్), ఏఆర్ ఎస్సై నర్సింలు(పోలీస్ హెడ్ క్వార్టర్స్), ఏఆర్ ఎస్సై సత్యనారాయణ గౌడ్(హెడ్ క్వార్టర్స్)ను సీపీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి పని ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం గొప్ప విషయమని అన్నారు. పదవీ విరమణ పొందిన సిబ్బందికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడు సహాయంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, రిజర్వు సీఐ శ్రీనివాస్, తిరుపతి, సతీశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ధన్‌పాల్ కృషితోనే ఇంజినీరింగ్ కళాశాల మంజూరు



నిజామాబాద్ రూరల్: తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయడంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కీలక పాత్ర వహించారని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తీక్, నాయకులు అన్నారు. నగరంలోని దేవి టాకీస్ చౌరస్తాలో ఎమ్మెల్యే ధన్‌పాల్ చిత్రపటానికి బీజేవైఎం నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సాయికుమార్, సురేశ్, అక్షయ్, అంబోల్ రాజు, అనిల్, రాజశేఖర్, సంజయ్ పురోహిత్, ప్రశాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి పోరాటాలతోనే..

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యార్థి పోరాటాలతోనే ఇంజినీరింగ్ కోర్సులు సాధించుకున్నామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. తెయూలో నాలుగు ఇంజినీరింగ్ కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇంజినీరింగ్ కోర్సులను మూడో విడత కౌన్సిలింగ్‌లో పెట్టాలని, కోర్సులకు కావాల్సిన ఫ్యాకల్టీని అందుబాటులో ఉంచి, మిగతా కోర్సులను కూడా తీసుకు రావాలని కోరారు. దశలవారిగా ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కాలేజ్ మంజూరైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థుల చిరకాల కోరిక అయిన ఇంజినీరింగ్ కాలేజ్‌ను మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించిన నిర్మాణ పనులు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులో తేవాలని కోరారు. కోర్సులకు కావాల్సిన ఫ్యాకల్టీని అందుబాటులో ఉంచాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు పతకాలు తేవాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో రాణించి జిల్లా పతకాలు తీసుకరావాలని జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి అభినవ్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో సబ్‌జూనియర్, క్యాడెట్ బాలబాలికలకు జూడో ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో ప్రత్యేకంగా అభినందించారు. పీఈటీలు అనిత, శ్యామల, వికాస్, శ్రీకాంత్, నవీన్, మానస, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులు ఫ్యూజులు మార్చొద్దు



డిచ్‌పల్లి: విద్యుత్ సమస్య ఏర్పడినప్పుడు రైతులు సొంతంగా ఫ్యూజులు మార్చి ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని డిచ్‌పల్లి సబ్‌స్టేషన్ ఏడీఈ శ్రీనివాస్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో విద్యుత్ అధికారులు పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఏఈ గంగారాం, లైన్‌ఇన్‌స్పెక్టర్లు అబ్బయ్య, పోశెట్టి, లైన్‌మన్‌లు, జేఎల్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజామాబాద్ సిటీ/ నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయడంపై జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు సంబురాలు చేపట్టారు. గురువారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద పటాకులు కాల్చి, మిఠాయిలు పంచారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి వేణురాజ్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాల కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ రావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నవీన్, రమేశ్, గంగప్రసాద్, నరేందర్ సింగ్, సాయికిరణ్, కౌశిక్, మణి, రాజు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



ఖలీల్‌వాడి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుదారులతో మర్యాద ఉండాలని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది తరచుగా నగరంలోని వార్డులను సందర్శించి, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులలో ఉన్న వాహనాల అడ్రస్ తెలుసుకుని, సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని ఎస్సై గంగాధర్‌కు సూచించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించిన వార్డులకు తరచుగా సందర్శిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని తెలిపారు.

దోస్త్ 'ప్రత్యేక' ధ్రువపత్రాల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్–డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన గురువారం నిర్వహించినట్లు దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. అడ్మిషన్స్ కార్యాలయంలో ప్రత్యేక కేటగిరి పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించామన్నారు. ఎన్‌సీసీలో నలుగురు, స్పోర్ట్స్‌లో ఇద్దరు, పీహెచ్‌సీలో ఒకరు మొత్తం ఏడుగురు విద్యార్థులు పరిశీలనకు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, తెయూ ఫిజికల్ డైరెక్టర్ నేత, సిబ్బంది రవీందర్‌నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



నిజామాబాద్‌అర్బన్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం అందించాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరేందర్, ఎం.సుధాకర్, ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, బి.మల్లేశ్, సాయారెడ్డి, మురళి, లింగం, కిరణ్, రవి, రాజేశ్వర్, హేమలత, సుమలత, శారద, శివకుమార్, లక్ష్మి, రజిని, నవనాథ్, శ్రీనివాస్, లాలయ్య, గంగాధర్, మహేశ్, శ్రీధర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో వర్గీకరణను అమలు చేయండి



నిజామాబాద్‌అర్బన్: విద్యా శాఖలోని టీచర్ల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు డీఈవో అశోక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు చట్టబద్ధత తీసుకురావడంతో అమల్లోకి వచ్చిందన్నారు. పదోన్నతుల్లో కూడా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఎస్సీలలో గ్రూపుల వారిగా విభజనను అమలు చేస్తే అందరికి న్యాయం జరుగుతుందన్నారు. స్పందించిన డీఈవో వర్గీకరణ అమలు చేస్తామని పేర్కొన్నారు. మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, తెడ్డు గంగారాం, మారుతి, గద్దల రమేశ్ తదితరులు ఉన్నారు.

గుత్ప, అలీసాగర్ ఆయకట్టుకు నీటిని అందించాలి



నిజామాబాద్ సిటీ: గుత్ప, అలీసాగర్ ఆయకట్టు కింద రైతులు నాట్లు వేసుకున్న పొలాలకు నీటిని అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. గోదావరి నది నుంచి ఎస్సారెస్పీకి వరదలు వస్తున్నందున వెంటనే అధికారులు గుత్ప, అలీసాగర్ ఆయకట్టుకు నీటిని అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్ల చట్టాలను రైతాంగ ఉద్యమాల ఫలితంగా మోడీ ప్రభుత్వం మళ్లీ నూతన వ్యవసాయ మార్కెట్ విధానాల పేరుతో దొడ్డిదారున తీసుకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, సాయిలు, గోపాల్, బన్సీ, బుచ్చన్న, రాపాని గంగాధర్, గోపాల్, దేవస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



మైనారిటీ గురుకుల విద్యార్థులతో అధ్యాపకులు



జక్రాన్‌పల్లి ఎంజేపీ విద్యార్థినులు



పతకాలు సాధించిన సిరికొండ యువకులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

నిజామాబాద్‌నాగారం/ జక్రాన్‌పల్లి: నగరంలోని మైనారిటీ గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సయ్యద్‌హైదర్ గురువారం తెలిపారు. రాజారాం స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అర్జున్, ధన్‌రాజ్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–20 విభాగంలో షాట్‌పుట్‌లో అర్జున్, అండర్–18 విభాగంలో 200మీటర్ల పరుగుపందెంలో ధన్‌రాజ్ బంగారు పతకాలు సాధించారు. అనంతరం క్రీడాకారులను, పీడీ కోటేశ్వర్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనూష తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్–20 ఉమెన్ కేటగిరి అథ్లెటిక్ పోటీలకు గాయత్రి, నవనీత, మౌనిక, నవిత ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అనూష, ఉపాధ్యాయులు అభినందించారు.
సిరికొండ: మండల కేంద్రానికి చెందిన యువకులు గంగరాజు, గౌతమ్ అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు సాధించారని తెలంగాణ జాగృతి రూరల్ కన్వీనర్ మల్లెల సాయిచరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో చిట్యాల గంగరాజు, మూడు కిలోమీటర్ల విభాగంలో గౌతమ్‌లు మొదటి స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారని అన్నారు. అనంతరం యువకులను గ్రామస్తులు అభినందించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

సిరికొండ: మండలంలోని తూంపల్లికి చెందిన ముగ్గురు క్రీడాకారిణులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని జెడ్పీహెచ్ఎస్ పీడీ నాగేశ్ గురువారం తెలిపారు. హైదబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబర్చిన ఆర్ రాజశ్రీ, అక్షయ, బి శ్రీజలు ఎంపికై నట్లు ఆయన పేర్కొ న్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఈ నెల 1 నుంచి 12 వరకు నిర్వహించే జాతీయ స్థా యి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై వీడీసీ సభ్యులతో పాటు ఎంఈవో రాములు,ఇన్‌చార్జి హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయు లు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ హర్షం వ్యక్తం చేశారు.

లింగన్నకు ఘన నివాళులు



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు పూనెం లింగన్న 6వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. లింగన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, నారాగౌడ్, లింబాద్రి, దామోదర్, రమేశ్, బాల్‌రెడ్డి, భూమాగౌడ్, కిశోర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పడకల్‌లో శతాధిక వృద్ధుడు మృతి



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు (100)కోమటి రమణయ్య గురువారం మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు లింగయ్య ఉన్నాడు. రమణయ్య మృతి చెందే వరకు ప్రతి రోజు అర కిలోమీటరు దూరంలో ఉన్న తన వ్యవసాయ క్షేత్రానికి నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాడని గ్రామస్తులు తెలిపారు. రమణ య్య మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అడిషనల్ కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిద్దల నాగరాజు, పోషమైన మహేశ్, వేణు, విశాల్,కాశిఫ్,సాయి, చరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సిరికొండ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో మత్తు పదార్థాల నియంత్రణపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై తమ జీవిత లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లవద్దన్నారు. ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైమద్‌పురలో ఆపరేషన్ ఛబుత్రా

ఖలీల్‌వాడి: నగరంలోని హైమద్‌పుర కాలనీలో బుధవారం రాత్రి పోలీసులు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని రోడ్లపై తిరుగుతున్న 50 మంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రివేళల్లో తిరగవద్దని, రోడ్లపై బైక్‌లపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 25 వాహనాలకు పత్రాలు లేనందున వాటిని పరిశీలించిన తర్వాత చలాన్‌లు వేసి వాహనాదారులకు అప్పగించారు. ఎస్సై సయ్యద్ ముజాహిద్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీ పట్టివేత

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గుట్టల నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అనుమతులు లేకుండా గుండారం గుట్ట నుంచి అక్రమంగా మొరంను తరలుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా మొరం, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.